సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 14 । జూలై । 2023



ఇథనాల్ కథేంది?
నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్–గుండపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది. కాలుష్యంపైనే స్థానికులు అనుమానం వ్యక్తంజేస్తున్నారు. IIలో▸

కలెక్టర్, ఎస్పీకి నోటీసులు
ఆదిలాబాద్‌రూరల్: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కోయపోషగూడ ఘటన వ్యవహారంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపూరావు ఫిర్యాదు చేయగా జాతీయ ఎస్టీ కమిషన్ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. 15రోజుల్లోపు ఘటనకు సంబంధించి వాస్తవ సమాచారం తెలుపాలని కమిషన్ అందులో పేర్కొంది.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం
పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు



డంప్‌యార్డును పరిశీలిస్తున్న శ్రీజ

ఇంద్రవెల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా మండలంలోని ముత్నూర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయవద్దని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. గురువారం ముత్నూర్ గ్రామాన్ని సందర్శించారు. పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, డంప్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడారు. మరుగుదొడ్ల ఉపయోగంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. డీపీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్డీవో రవీందర్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, సర్పంచ్ తుంరం బాగుబాయి తదితరులున్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ భాస్కర్

ఆదిలాబాద్‌టౌన్: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మేస్రం భాస్కర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యాసంస్థల బంద్ సందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు దేవిదాస్, గోపాల్, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

15నుంచి రూ.లక్ష సాయం

కైలాస్‌నగర్: బీసీ కుల వృత్తుల వారికి ఈనెల 15నుంచి రూ.లక్ష ఆర్థికసాయం చెక్కులు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి పథకం అమలుపై బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరగా పూర్తిచేసి జిల్లా లాగిన్‌కు పంపాలని ఆదేశించారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి

బేల: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ చేపట్టని ప్రభుత్వం కనీసం పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ స్వామి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంతో పాటు గూడ, సాంగిడి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించారు. సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయ పదోన్నతులతో ఈ సమస్య తీరి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందని చెప్పారు. పని సర్దుబాటు పేరిట తాత్కాలిక పద్ధతిలో ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు కేటాయించడంతో ప్రాథమిక పాఠశాలలు నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ఈ శివన్న, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, ప్రేంసింగ్, అజయ్, అశోక్, గజానన్, సుగుణాకర్, భీమ్‌దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



సిరికొండలో పరిశీలిస్తున్న బృందం సభ్యులు

సిరికొండ: మండలంలోని సిరికొండ, మల్లాపూర్ పంచాయతీల పరిధిలో 2019 నుంచి చేపట్టిన ఉపాధిహామీ పనులను మినిస్టర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. బృందం సభ్యులు మొగులయ్య, బాలరాజు, ఏపీఎం శేషరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారు ప్లాట్ పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు

పరిశీలన ప్రశ్నార్థకం!

- వేలల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు
- మూడునెలలుగా వందల్లోనే పరిశీలన
- నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

పట్టణంలోని ఎల్‌ఆర్‌ఎస్ బ్లాక్‌లు: 8
ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు: 19,203
ఇప్పటివరకు పరిశీలించినవి: 760
రెగ్యులరైజ్‌కు ఆమోదం పొందినవి: 706
తిరస్కరించిన దరఖాస్తులు: 44
డాక్యుమెంట్లు అవసరమైనవి: 10

2020 ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం చదరపు అడుగుకు చెల్లించాల్సిన మొత్తం
100 లోపు చదరపు మీటర్లు: రూ.200
101 నుంచి 300 మీటర్లు: రూ.400
301 నుంచి 500 మీటర్లు: రూ.600
500 నుంచి ఆపైన: రూ.750
మురికివాడల్లో (ప్లాట్ విస్తీర్ణం, విలువతో సంబంధం లేకుండా): రూ.5

సిబ్బంది కొరతతోనే జాప్యం

పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడం సమస్యగా మారింది. మా విభాగానికి సంబంధించి రోజువారీ పనులతో పాటు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన చేపట్టాల్సి వస్తోంది. దీంతో జాప్యం జరుగుతోంది. అదనపు సిబ్బంది కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి అనుమతి లభిస్తే ప్రక్రియను వేగవంతం చేస్తాం. – అనురాధ, టౌన్ ప్లానింగ్ అధికారి

కైలాస్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా, అనధికార లేఅవుట్లలో ఉన్న పాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియ ప్రారంభించి మూడు నెలలవుతున్నా 3శాతం దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తి కాలేదు. ప్రక్రియ ఇలాగే కొనసాగితే మరో మూడేళ్లయినా పూర్తి కాని పరిస్థితి ఉండగా దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడంలేదు.

2020లో దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రవేశపెట్టింది. దీని కింద 2020 ఆగస్టు 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి రుసుంతో దరఖాస్తులు స్వీకరించింది. ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ఆదిలాబాద్, ఖానాపూర్, అనుకుంట (కొంత భాగం), భుక్తాపూర్, రాంపూర్ (కొంతభాగం), మావల, బట్టిసావర్‌గాంవ్, కచ్‌కంటి తదితర ఎనిమిది బ్లాక్‌ల నుంచి 19,203 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్లాట్ రెగ్యులరైజ్ అయితే ఇంటి నిర్మాణ అనుమతులతో పాటు బ్యాంక్ రుణాలు పొందవచ్చనే మున్సిపల్ అధికారుల ఆదేశాలతో చాలామంది దరఖాస్తు చేశారు. వీటిని అప్పట్లోనే రెగ్యులరైజ్ చేయాల్సి ఉండగా రాష్ట్రస్థాయిలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించగా ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగా అధికారులు దరఖాస్తుల పరిశీలనపై దృష్టి సారించారు.

పరిశీలన గోరంతే..

దరఖాస్తు చేసుకున్న ప్రతీ ప్లాట్‌ను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. ప్లాట్ కొలతలను నిర్ధారించుకోవడంతో పాటు వాటి డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉంటుంది. 2020 ఏప్రిల్ 26కు ముందు ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయంలో మార్కెట్ ధర ప్రకారం ఆ ప్లాట్ పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుల పరిశీలన నెమ్మదిగా సాగుతోంది. రోజుకు 4, 5 ప్లాట్లను మాత్రమే అధికారులు పరిశీలిస్తున్నారు. రెగ్యులర్ కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు. దీంతో ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా తమ ప్లాట్లను అధికారులు ఎప్పుడు పరిశీలిస్తారోనని దరఖాస్తుదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. మున్సిపల్ పరిధిలో 19,203 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం అందగా ఈ ఏడాది ఏప్రిల్‌లో వాటి పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. మూడు నెలల వ్యవధిలో 760 దరఖాస్తులు మాత్రమే పరిశీలించారు. అందులో ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా లేని 44 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 10 ప్లాట్లకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో ఉంచారు. ఇందులో ఎల్ 1 టీపీఎస్, ఎల్ 2 టీపీవో స్థాయిల్లో 760 దరఖాస్తులు ఉండగా ఎల్ 3 కమిషనర్ స్థాయిలో 706 ఎల్‌ఆర్‌ఎస్ అప్రూవల్ కోసం సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిశీలన ఇదే స్థాయిలో కొనసాగితే మరో మూడేళ్లు గడిచినా పూర్తి కావడం కష్టమనే భావన వ్యక్తమవుతోంది.

ఆర్వో, ఏఆర్వోల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్(ఆర్వో, ఏఆర్వో) ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్ రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలకు ఆయా స్థానాల్లో పని చేసే ఆఫీసర్లే ఎన్నికల బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. రిటర్నింగ్ ఆఫీసర్లుగా ఐఏఎస్, ఆర్డీవోలు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లోని తహసీల్దార్లు వ్యవహరించనున్నారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ ఆఫీసర్	అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు(తహసీల్దార్లు)
సిర్పూర్	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)	సిర్పూర్(టీ), కాగజ్‌నగర్, బెజ్జూరు, పెంచికల్‌పేట, కౌటాల, చింతలమానేపల్లి, దహెగాం
చెన్నూరు (ఎస్సీ)	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ మంచిర్యాల	మందమర్రి, జైపూర్, చెన్నూరు, కోటపల్లి, భీమారం
బెల్లంపల్లి (ఎస్సీ)	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మంచిర్యాల	కాసిపేట, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూరు, వేమనపల్లి, నెన్నెల
మంచిర్యాల	ఆర్డీవో, మంచిర్యాల	దండేపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్
ఆసిఫాబాద్ (ఎస్టీ)	అదనపు కలెక్టర్(రెవెన్యూ), కుమురంభీం జిల్లా	నార్నూరు, గాదిగూడ, జైనూరు, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి, ఆసిఫాబాద్, వాంకిడి
ఖానాపూర్ (ఎస్టీ)	ఆర్డీవో, ఉట్నూరు	ఇంద్రవెల్లి, ఉట్నూరు, కడెం, దస్తూరాబాద్, ఖానాపూర్, పెంబి, జన్నారం, సిరికొండ
ఆదిలాబాద్	ఆర్డీవో, ఆదిలాబాద్	ఆదిలాబాద్(అర్బన్), ఆదిలాబాద్(రూరల్) జైనథ్, బేల, మావల
బోథ్ (ఎస్టీ)	పీవో, ఐటీడీఏ, ఉట్నూరు	బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, తలమడుగు, తాంసి, భీంపూర్
నిర్మల్	ఆర్డీవో, నిర్మల్	సారంగాపూర్, మామడ, లక్ష్మణచాంద, సోన్, నిర్మల్(రూరల్), నిర్మల్(అర్బన్), దిలావర్‌పూర్, నర్సాపూర్–జి
ముథోల్	ఆర్డీవో, భైంసా	కుభీర్, కుంటాల, భైంసా, లోకేశ్వరం, ముథోల్, బాసర, తానూరు

రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై నిరసన
- ఫ్లెక్సీకి ఉరితీత.. దిష్టిబొమ్మ దహనం



రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలిపారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి అనంతరం దహనం చేశారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంజేశారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట నిరసన కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నకు సంబంధించిన పాటలు ప్లే చేయగా, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అనుచరులు వాటిని నిలిపివేసి సీఎం కేసీఆర్ పాటలు వేయాలనడంతో గందరగోళం నెలకొంది. అక్కడే ఉన్న నాయకులు వారికి సర్దిచెప్పగా వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, నల్ల రాజేశ్వర్, ప్రశాంత్, మహేందర్, ఆనంద్, అయ్యూబ్, మొట్టె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీయడాన్ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి, దహనం చేస్తున్న సమయంలో పోలీసులు రక్షణ కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. అరెస్టయినవారిలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నగేశ్ తదితరులున్నారు.

త్వరలో ఎస్సైల బదిలీలు



సాక్షి, ఆదిలాబాద్: త్వరలో పెద్ద ఎత్తున ఎస్సైల బదిలీలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు దీనిపై కసరత్తు జరుగుతోంది. బాసర జోన్ స్థాయిలో నాలుగు జిల్లాల్లో ఈ ట్రాన్స్‌ఫర్లు చేయనున్నారు. మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని, సొంత జిల్లా, నియోజకవర్గాల్లో పనిచేస్తున్న వారిని బదిలీపై ఇతర జిల్లాలకు పంపనున్నారు. ఈమేరకు ఈ వారంలో నిజామాబాద్ ఐజీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో ఆదిలాబాద్‌రూరల్, జైనథ్, బోథ్, ఇచ్చోడ, ఉట్నూర్ సర్కిళ్లు ఉన్నాయి. ఆయా సర్కిళ్లు సీఐల పర్యవేక్షణలో, ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)ల పర్యవేక్షణలో కొనసాగుతాయి. జిల్లా మొత్తంగా 21 పోలీస్‌స్టేషన్లున్నాయి. ఎస్పీ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలు, పోలీస్ యంత్రాంగం లా అండ్ ఆర్డర్‌ను పర్యవేక్షిస్తారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల అంశం కీలకం. ఈ నేపథ్యంలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న, స్థానికత ఉన్నవారిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తారు.

ఇప్పటికే ప్రక్రియ ప్రారంభం

పోలీస్‌శాఖలో బదిలీల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఇటీవల జిల్లా నుంచి కొంతమంది సీఐలు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. బుధవారం రాష్ట్రంలో కొంతమంది డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఎన్నికల నిబంధనల మేరకు ప్రక్రియ జరుగుతోంది. జిల్లా నుంచి సుమారు 15మంది ఎస్సైలు బదిలీ అయ్యే అవకాశమున్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఆదిలాబాద్ పట్టణంలో పనిచేస్తున్న వారంతా ఇతర జిల్లాలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలికంగా జిల్లాలో పనిచేస్తుండడంతో వారిని ఈ బదిలీల్లో తప్పనిసరి ఇతర ప్రాంతాలకు పంపించనున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని సంప్రదించగా, బదిలీలు వాస్తవమే కానీ.. కొంత సమయం పట్టవచ్చని తెలిపారు.

బ్యాక్టీరియా వినియోగంపై అవగాహన



భాస్వరం చల్లే విధానాన్ని వివరిస్తున్న పుల్లయ్య

తాంసి: భీంపూర్ మండలం తాంసి(కే) గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వినియోగంపై రైతులకు డీఏవో పుల్లయ్య అవగాహన కల్పించారు. రైతులు బ్యాక్టీరియాను విరివిగా వాడి పెట్టుబడులు తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం భీంపూర్‌లో సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ఏవో రవీందర్, ఏఈవో సంగీత, శంకర్, సర్పంచ్ కరీం, లింబాజీ తదితరులున్నారు.

పంటల వివరాలు నమోదు

భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామంలో డీఏవో పుల్లయ్య పంటల వివరాల నమోదును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులు, ఏఈవోతో సెల్ఫీ దిగారు. ఆయన మాట్లాడుతూ.. ఏఈవోలు చేపట్టిన పంటల నమోదు వివరాలు సరిగా ఉన్నాయో.. లేదో.. క్రాప్ బుకింగ్‌లో పరిశీలించనున్నట్లు తెలిపారు. ఒక్కో ఏడీఏ మండలానికో 20 మంది రైతుల చొప్పున రెండు మండలాల్లో 40 మంది వివరాలు నమోదు చేయాలన్నారు. ఏవోలు గ్రామానికి 20మంది చొప్పున మండలంలోని రెండు గ్రామాలకు చెందిన 40మంది రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏఈవో సాయి తదితరులున్నారు.

15లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి



బైక్ ర్యాలీలో కలెక్టర్ రాహుల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, అధికారులు, నాయకులు

కైలాస్‌నగర్: 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 15లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ కొమురంభీంచౌక్, ఎన్టీఆర్‌చౌక్, నేతాజీచౌక్, వినాయక్‌చౌక్ మీదుగా కలెక్టరేట్‌కు చేరింది. కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బైక్ నడుపుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 1.10.2023 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా ఓటరు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో అరవింద్‌కుమార్, జిల్లా యువజన, క్రీడా సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు నలంద ప్రియ, కలెక్టరేట్ పర్యవేక్షకులు స్వాతి, ఏడీఎం రవి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు

నేరడిగొండ: మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో మాతాశిశు సంరక్షణలో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. 15రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లి సిబ్బంది, ఏఎన్‌ఎంలు గర్భిణుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు సంక్లిష్ట గర్భిణులను ప్రతిరోజూ కలిసి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమ లక్ష్యాలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, ఇటీవల పీహెచ్‌సీలో ఓ వైద్యాధికారి వ్యవహరించిన తీరుపై సమావేశంలో చర్చించకపోవడం గమనార్హం. ఈనెల 10న 'డాక్టర్ తీరు మారలే' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, దీనిపై చర్చించకపోవడంతో సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. డాక్టర్ విజయసారథి, డాక్టర్ శ్రీధర్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమ్మేళన సమావేశానికి ప్రోగ్రాం కన్వీనర్‌గా కొమ్ము విజయ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దళిత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల చివరి వారంలో ఉట్నూర్ కేంద్రంగా నిర్వహించే కాంగ్రెస్ పార్టీ దళిత సమ్మేళన సమావేశానికి ప్రోగ్రాం కన్వీనర్‌గా ఎస్సీ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎస్సీ విభాగం స్టేట్ కమిటీ మెంబర్స్, వైస్ చైర్మన్లు, కన్వీనర్లు, డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులందరూ తప్పకుండా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం ఆదేశించారని ఆయన పేర్కొన్నారు.

మధ్యవర్తులను నమ్మొద్దు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాల/ పాఠశాలల్లో మిగిలిన సీట్లను ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థులను మాత్రమే మెరిట్ ప్రకారం గురుకుల కార్యాలయం హైదరాబాద్ ద్వారా భర్తీ చేయడం జరుగుతుందని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ గురువారం తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థుల తల్లిదండ్రులు, అభ్యర్థులు గమనించాలని కోరారు. సీట్లు ఇప్పిస్తానని మధ్యవర్తుల ద్వారా మోసపోవద్దన్నారు. ఐటీడీఏ గురుకులం కార్యాలయంలో ఎటువంటి కళాశాల / పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించబడవన్నారు. ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, పక్కనే ఎస్సై

తాండూర్: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం... తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ వైన్స్ వద్ద గురువారం తాండూర్‌ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ క్రమంలో పోలీసులను చూసి తాండూర్ సుభద్ర కాలనీకి చెందిన షేక్ అబ్బు అనే వ్యక్తి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అనుమానం వచ్చి అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయడంతో అందులో 250 గ్రాముల గంజాయి లభించింది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే కోరికతో మహారాష్ట్రలోని చంద్రపూర్ నుండి గంజాయి తీసుకు వచ్చి స్థానిక యువకులకు అమ్ముతున్నట్లు నిందితుడు అంగీకరరించాడని సీఐ తెలిపారు. ఈ మేరకు అబ్బుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజశేఖర్ ,ఏఎస్సై లు శ్రీనివాస్, లక్ష్మణ్ ల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తున్న ఒకరిపై కేసు

ఇంద్రవెల్లి: నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సునిల్ గురువారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని దొంగర్‌గామ్ గ్రామానికి చెందిన రాజేందర్ అనే వ్యక్తి సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దొంగర్‌గామ్‌లో దాడులు నిర్వహించి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలోని ఓల్డ్ యాజ్ హోం నుంచి రొడ్డ గంగామణి (46) అదృశ్యమైనట్లు ఎస్సై ఇసాక్ అలీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం కానికేపేట్ గ్రామానికి చెందిన గంగామణి అనాథ కావడంతో ఆమెను ఈ ఏడాది 21 ఏప్రిల్ ఓల్డ్ యాజ్ హోంలో చేర్పించారు. గురువారం ఓల్డ్ యాజ్ హోంలో ఉదయం టిఫిన్ పెట్టే సమయంలో ఆమె కనిపించలేదు. దీంతో ఓల్డ్ యాజ్ హోం సూపరింటెండెంట్ గొల్లివార్ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల తప్పిపోయిన ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన యువకుడు ఖమరొద్దీన్ ఆచూకీ లభ్యమైనట్లు టూటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. జైనూర్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకొని యువకుడిని ఆదిలాబాద్ పట్టణానికి తీసుకు వచ్చారు. గురువారం ఆయన కుటుంబీకులకు అప్పగించినట్లు వివరించారు.

చోరీకి గురైన కారు లభ్యం

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలోని అపోలో మెడికల్ షాపు వద్ద ఈ నెల 12న చోరీకి గురైన కారు గురువారం లభించిందని సీఐ రాజు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మెడికల్ దుకాణం వద్ద కారు నిలిపి ఉంచగా చోరీకి గురైంది.

ఇథనాల్.. కథేంది..!?

- కేంద్ర ప్రోత్సాహం.. రాష్ట్ర సహకారంతో..
- జిల్లాలోనూ కొత్త పరిశ్రమ ఏర్పాటు
- ధాన్యం, మక్కలతోనే తయారీ..
- పెట్రోలియం ఉత్పత్తిగా ఉపయోగం
- కాలుష్యంపైనే స్థానికుల్లో అనుమానం
- అవగాహన కల్పించాల్సిన అవసరం



దిలావర్‌పూర్-గుండంపల్లి మధ్య కొనసాగుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు పనులు

నిర్మల్: దినదినాభివృద్ధి చెందుతున్న జిల్లాలో పారిశ్రామిక ప్రగతి లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు దీన్ని తీర్చేందుకే అన్నట్లుగా సోన్ మండలం పాక్‌పట్లలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ, దిలావర్‌పూర్ మండల కేంద్రం-గుండపల్లిల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటవుతున్నాయి. ఈ రెండింటిలో ఆయిల్‌పాం గురించి పెద్దగా చెప్పాల్సిన పనిలేదు. రైతులు, గ్రామీణులకూ దీనిపై ఎంతోకొంత అవగాహన ఉంది. కానీ.. ఇథనాల్ ఫ్యాక్టరీ విషయానికి వచ్చేసరికి ఇప్పటి వరకు జిల్లావాసులకు సంబంధం లేని కొత్తవిషయం. పేరులోనే ఇదేదో రసాయన పరిశ్రమ అన్నట్లుగా ఉండటం, చాలామందికి దీనిపై అవగాహన లేకపోవడం, మరోవైపు అధికారులూ ముందస్తుగా అవగాహన కల్పించకపోవడం వ్యతిరేకతకు కారణమవుతోంది. ప్రధానంగా పరిశ్రమలంటే వస్తు ఉత్పత్తితో పాటు కాలుష్యాన్ని విడుదల చేస్తాయన్న పేరుంది. ఈ క్రమంలోనే ఇథనాల్ ఫ్యాక్టరీపై అందరిలో అనుమానాలు ఉన్నాయి. అధికారులు మాత్రం ఇందులో కాలుష్య రహిత ఉత్పత్తిని చేపట్టనున్నట్లు చెబుతున్నారు.

కేంద్ర పోత్సాహం.. రాష్ట్ర సహకారం


పెట్రోల్ వినియోగం అతిగా పెరగడం, అందుకు తగ్గట్లు ఉత్పత్తి లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం కొంతకాలంగా ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. ఇథనాల్‌ను కేవలం ఇంధనంగా వాడేందుకే ప్రస్తుతం కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటు వేగవంతం చేస్తోంది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రాం(ఈబీపీ) ద్వారా దేశవ్యాప్తంగా కనీసం జిల్లాకు ఒక ఇథనాల్ ఫ్యాక్టరీ ఉండాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. ఇందుకు కేంద్ర పర్యావరణశాఖ స్థానిక పరిస్థితులను బట్టి అనుమతులనూ ఇస్తోంది. ఇక పంట ఉత్పత్తుల ద్వారా ఇథనాల్ తయారవుతుంది కాబట్టి రైతులనూ ప్రోత్సహించినట్లవుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్రం ప్రోత్సహానికి రాష్ట్రప్రభుత్వ సహకారం తోడవుతోంది.

జిల్లాలో ఎందుకంటే..

పుష్కలమైన నీటివనరులున్న జిల్లా పూర్తిగా వ్యవసాయాధారితమే. ఇక్కడ వరితో పాటు మక్క, సోయా, జొన్న సాగు ఎక్కువగా ఉంటుంది. ఇథనాల్ తయారీకి కావాల్సిన పంట ముడిపదార్థాల లభ్యత లెక్కల ఆధారంగా జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌కు సమీపంలో దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల శివారులో పీఎంకే సంస్థ ఫ్యాక్టరీ ఏర్పాటు పనులు మొదలుపెట్టింది.

అసలేంటీ ఇథనాల్..

ఇథనాల్.. దీన్ని ఇథైల్ ఆల్కహాల్ అని పిలవొచ్చు. పిండి పదార్థాలను పులియబెట్టడం (కిణ్వప్రక్రియ) ద్వారా దీన్ని తయారు చేస్తారని భైంసా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ అర్చన వివరించారు. వరిధాన్యం, మక్కలు, జొన్నలు, సోయలు, చెరుకు తదితర పంట ఉత్పత్తులను సేకరించి, భారీ బాయిలర్‌లలో ఫెర్మెంటేషన్ (పులియబెట్టడం) చేస్తారు. అలా ఫెర్మెంటేషన్ చేయడం ద్వారా వచ్చిన ఆవిరి(స్టీమ్)ను ఇథనాల్(ఇథైల్ ఆల్కహాల్) అంటారు. లిక్విడ్ రూపంలో వచ్చినదాన్ని శుద్ధి చేసి, బ్లెండింగ్ అనంతరం ఫ్యూయల్(పెట్రోల్)గా ఉపయోగంలోకి తీసుకురావడం ప్రస్తుతం ప్రధాన కారణం. మద్యం తయారీలోనూ ఇథైల్ ఆల్కహాల్ శాతమే ఎక్కువ. ఇక ఇథనాల్ తయారీలో పాడిగా మారిన పిండి పదార్థాన్ని పౌల్ట్రీలలో కోళ్లకు దాణాగా ఉపయోగిస్తారు.



ఇథనాల్ ఇంధనం ఏర్పాటు ప్రక్రియ

అనుమానాలేమంటే..

ఫ్యాక్టరీ అనగానే వస్తుత్పత్తితో పాటు పారిశ్రామిక కాలుష్యం కళ్ల ముందు కదలాడుతుంది. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానిక రైతుల్లోనూ అవే అనుమానాలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటువల్ల పంటలకు భరోసా, తమ ప్రాంతవాసులకు ఎంతోకొంత ఉపాధి దొరుకుతుందన్న ఆశ చాలామందిలో ఉంది. కానీ.. ఎక్కడ తమ పంటభూములు దెబ్బతింటాయో, పంటలెక్కడ నాశనమవుతాయో, భూగర్భజలాలు ఎంతమేరకు కలుషితమవుతాయోనన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. అసలు.. కాలుష్య నివారణకు ఫ్యాక్టరీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టత లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు సంబంధిత ఫ్యాక్టరీ నుంచి గానీ సంబంధిత అధికారులు గానీ ఎలాంటి ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడమూ రైతుల వ్యతిరేకతకు కారణంగా చెబుతున్నారు. పరిశ్రమపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు కాలుష్యం, నష్టం లేకుండా ఉంటే తమకు ఇబ్బంది లేదన్న వాదననూ పలువురు రైతులు వినిపిస్తున్నారు.

మాకు నష్టం జరగొద్దు..



వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నం. కొత్తగా పెడుతున్న ఫ్యాక్టరీ వల్ల మా పంటభూములకు నష్టం జరగవద్దనే మేము కోరుకుంటున్నాం.

– జెల్ల పెద్దపోతన్న, రైతు, గుండంపల్లి

ముందుగా చెబితే..



గ్రామశివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ఏమవుతుంది, ఏం జరుగుతుందనేది ముందే అవగాహన కల్పించాలి. రైతులకు నష్టం కలుగకుండా ఉండాలి.

– గుణవంత్‌రావు, రైతు, దిలావర్‌పూర్

పర్యావరణ అనుమతితో..

ఇథనాల్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతి పొందారు. కాలుష్య నియంత్రణకు, వ్యర్థాల నిర్వహణకు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పద్ధతి చేపడతామని చెప్పారు. ఇలాంటి పద్ధతుల వల్ల పరిశ్రమ ఏర్పాటుతో నష్టం ఉండదు. దీనిపై త్వరలో అవగాహన కల్పించేలా చూస్తాం.

– లక్ష్మణప్రసాద్, పర్యావరణ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలి

చిరుత సంచారం

- భయాందోళనలో స్థానికులు



చిరుతపులి పాదముద్ర

ఉట్నూర్‌రూరల్: మండగలంలోని యేంక, ఉమ్రి గ్రామ పొలిమెరల్లో పులి సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం... యేంక, ఉమ్రి గ్రామాల మధ్యన రెండు రోజుల నుంచి చిరుతకు సంబంధించిన కాలిముద్రలు పంట పొలాల్లో దర్శనమిచ్చాయి. విషయాన్ని గమనించిన స్థానికులు సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు గురువారం ఆ ప్రాంతాలను సందర్శించారు. చిరుత పులికి సంబంధించిన ముంద్రలుగా ఉన్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు.



ఏఈవోల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వీఆర్‌ఏలను వ్యవసాయశాఖకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఏఈవోలు గురువారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రాజ్‌కుమార్, వైష్ణవి, రాజశేఖర్, సాగర్, సాయిక్రిష్ణ, శివరంజని, దివ్య, చందన, సుధరాణి, ప్రణీత, కోమురయ్య, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘వ్యక్తులు పోతే పార్టీకి నష్టం లేదు’



సమావేశంలో మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: వ్యక్తులు పార్టీని వీడితే బీజేపీకి నష్టం లేదని పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అప్పాల గణేశ్‌కు బీజేపీలో సముచిత స్థానం కేటాయించామన్నారు. పార్టీని ఎందుకు వీడారో ప్రజలకు ఆయనే సమాధానం చెప్పాలని సూచించారు. స్థానిక మంత్రి, ఆయన అనుచర గణం చేస్తున్న కబ్జాలు కుంభకోణాలను నిలదీసిన ఆయన తిరిగి బీఆర్ఎస్ లో చేరడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల్లో బీజేపీకి వస్తున్న ఆదరణను చూడలేకనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒడిసెల శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమల్‌నయన్, జిల్లా కార్యదర్శి కోరిపల్లి శ్రావణ్, దళిత మోర్చా అధ్యక్షులు రాచకొండ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, బీజేవైయం అసెంబ్లీ కన్వీనర్ కొండాజీ శ్రావణ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఆకుల కార్తీక్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల విఠల్, మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

తగిన మోతాదులో మందులు పిచికారీ చేయాలి

- ముథోల్ ఏరువాక శాస్త్రవేత్త నర్సయ్య



ధర్మోరలోని పత్తి పంటను పరిశీలిస్తున్న ముథోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త , కో ఆర్డినేటర్ నర్సయ్య

లోకేశ్వరం: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు తగిన మోతాదులో మందులు పిచికారీ చేయాలని ముథో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ నర్సయ్య అన్నారు. మండలంలోని ధర్మోరలో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, వరి, సోయా పంటలను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చే పురుగుల బెడద ఉందన్నారు. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ ఒక లీటరు నీటికి లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రాముల మందును పిచికారీ చేయాలని తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటకు ఎండుతెగులు సోకే అవకాశం ఉందన్నారు. నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటామైసిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి తెగుళ్ల సోకిన మొక్కల వేర్లు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, కార్తీక్ ఉన్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

లక్ష్మణచాంద: మద్యం మత్తులో వాహనం నడిపి ఒకరి నిండు ప్రాణాన్ని వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన జడ రాజేశ్వర్ (54) ఎప్పటిలాగే బుధవారం ఉదయం 6గంటల సమయంలో రాచాపూర్ నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం పొట్టపెల్లి (కే) గ్రామం వైపు కాలినడకన వెళ్తున్నాడు. అదే సమయంలో లక్ష్మణచాంద నుంచి నిర్మల్ వైపునకు అరిసెల నరేష్ తన సోదరుడు అరిసెల రాకేష్‌కు చెందిన టెంట్‌హౌస్ సామగ్రిని ట్రాలీలో వేసుకుని నిర్మల్‌కు వెళ్లే క్రమంలో రాచాపూర్ గ్రామ శివారులో రాజేశ్వర్‌ను ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ సమయంలో ఆ వైపుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి రాజేశ్వర్‌ను ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందాడు. నిందితుడిని పట్టుకుని పోలీసులు పరీక్షించగా మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య రుక్మవ్వ ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తుకు సహకరించిన సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై రాహుల్ గైక్వాడ్, పీసీలు సునీల్, గణేష్, వనిత, సాయి అభినంధించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం




ప్రమాదంలో గాయపడిన బాధితులు

కుంటాల: మండలంలోని కుంటాల-కల్లూర్ క్రాస్ రోడ్డు 61 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఎస్సై హన్మండ్లు వివరాల ప్రకారం...

నర్సాపూర్(జి) నుంచి ట్రాక్టర్‌లో మొక్కలను అటవీ అధికారులు తీసుకొచ్చే క్రమంలో మహారాష్ట్ర భోకర్ నుంచి కూరగాయలు తరలిస్తున్న బొలేరో వాహనం ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో డ్రైవర్ సలీం, సాయినాథ్, తుకారం, రియాజ్, ట్రాక్టర్ డ్రైవర్ దయాకర్‌తో పాటు నడిపి గజ్జారాంకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ యజమాని యెజాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



రక్షణ కల్పించకుంటే.. ప్రమాదమే




జిల్లా కేంద్రంలోని అధికార ప్రజాప్రతినిధులు ఉండే కూతవేటు దూరంలోని మల్లన్నగుట్టను ఆనుకోని కొందరు గుట్టను తవ్వి పెద్ద బొయ్యరంలా తయారు చేసి వదిలేశారు. ఈ గుంతకు ఇలాంటి రక్షణ లేపోవడంతో నోరుతెరుచుకుని ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ లోయ దాదాపు గుట్ట పైనుంచి కింది వరకు రెండు మూడు వందల అడుగుల లోతు ఉంటుంది. ఇందులో పుష్కలంగా నీరు ఉండడంతో కొందరు పిల్లలు సెలవు దినాల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గత నెల ఈతకు వెళ్లి ఓ యువకుడు చనిపోయిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ గుట్టచుట్టూ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వకాలు నిలిపివేసి రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్వీపర్లు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో స్వీపర్లు తమ సమస్యలపై మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 25, 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. వారికి కనీస వేతనం చెల్లించకుండా రూ.3 వేల, రూ.4 వేలు చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి, కొన్ని ప్రభుత్వ సంస్థల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, పట్టణ ఇన్‌చార్జి గాదె విలాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వోడిసెల అర్జున్, ఉపాధ్యక్షుడు విజయ్, అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రావణ్, మాజీ కౌన్సిలర్ భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల్లో మట్టి..




సాక్షి ఎఫెక్ట్

కార్యాలయాల్లోకి వెళ్లేదెలా? అనే శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు కార్యాలయం ఆవరణలో మట్టి పోసి చదును చేశారు. దీంతో మురుగునీరు వెళ్లి శుభ్రంగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

‘కడెం’కు స్వల్పంగా ఇన్‌ఫ్లో



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు గురువారం ఉదయం 8,635 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కడెం పూర్తి స్థాయి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటిమట్టం 684.275(4.180టీఎంసీ) అడుగులుగా ఉందని అధికారులు తెలిపారు.